రాణిపేటలో

తైవాన్ పరిశ్రమ

- రూ.1500 కోట్లతో పాదరక్షల కర్మాగారానికి సీఎం శంకుస్థాపన
- 25వేల మందికి ఉపాధి అవకాశాలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 'హాంగ్ ఫూ' పాదరక్షల కర్మాగారానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాణిపేట జిల్లా సిప్కాట్ పనబాక్కంలో తైవాన్‌కు చెందిన 'హాంగ్ ఫూ' సంస్థ రూ.1500 కోట్ల పెట్టుబడితో పాదరక్షల కర్మాగారాన్ని నెలకొల్పనుంది. రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో సోమవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఈ కర్మాగారం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగాను 25 వేల మంది ఉపాధి కలుగుతుందని స్టాలిన్ తెలిపారు. తైవాన్‌కు చెందిన 'హాంగ్ ఫూ ఇండస్ట్రియల్ గ్రూపు' ఇరవైకి పైగా అనుబంధ సంస్థలతో అంతర్జాతీయ సంస్థగా పేరొందింది. ఈ సంస్థ క్రీడా సంబంధిత పాదరక్షల డిజైనింగ్, అభివృద్ధి, ఉత్పత్తి, అమ్మకాలు తదితర వాణిజ్య విస్తరణ కార్యకలాపాలను విరివిగా చేపడుతోంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. దీంతో రాణిపేట జిల్లా సిప్కాట్ పనబాక్కం ఇండస్ట్రియల్ పార్కులో ఆ సంస్థకు 200 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ స్థలంలో సోమవారం ఉదయం భూమి పూజ భారీ యెత్తున నిర్వహించారు. అదే సమయంలో సచివాలయం నుంచి సీఎం స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్మాగారానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఆర్.గాంధీ, టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక, వాణిజ్య శాఖ కార్యదర్శి వి.అరుణ్‌రాయ్, తోలు వస్తువుల ఎగుమతి మండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సెల్వం, రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.విష్ణు, సిప్కాట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే సెంథిల్ రాజ్, రాష్ట్ర పారిశ్రామిక మార్గదర్శక సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.అలర్‌మేల్‌మంగై, 'హాంగ్ ఫూ సంస్థ చైర్మన్ టీవై చాంగ్, డైరెక్టర్ జాక్కీ చాంగ్, జేవీ పార్టనర్, డైరెక్టర్ అకిల్ పనారునా తదితర అధికారులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో

మరో అల్పపీడనం

- రాష్ట్రానికి రెండు రోజులు భారీ వర్షసూచన

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతంలో తాజాగా అల్పపీడనం ఏర్పడిందని, ఇది మరో రెండు రోజుల్లో మరింత బలపడి సముద్రతీర జిల్లాల వైపు పశ్చిమ వాయువ్య దిశగా పయనించనున్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం దక్షిణ బంగళాఖాతం మధ్య ప్రాంతంలో ఓ అల్పపీడనం రూపుదిద్దుకుందని, అది బలపడి పడమర, వాయువ్య దిశలలో సముద్రతీర ప్రాంతాల వైపుగా కదులుతుందని, ఇప్పటికే దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయని అధికారులు వివరించారు. మంగళవారం పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని, ఇదే విధంగా చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై జిల్లాల్లో కొన్ని చోట్ల చెదురుమదురుగా వర్షాలు కురువనున్నాయి. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, తిరువారూరు, నాగపట్టినం జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఇదే రీతిలో బుధవారం చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు, విల్లుపురం జిల్లాల్లో పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురువనున్నాయి. సముద్రతీర ప్రాంతాల్లో మూడు రోజుపాటు గంటకు 35 నుండి 45 కి.మీ.ల వేగంతో పెనుగాలులు వీస్తాయని తెలిపారు.

మంత్రి సెంథిల్ బాలాజీ సహా

145 మంది కోర్టుకు హాజరు

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో ఉద్యోగాల్పిస్తామని అవినీతికి పాల్పడిన కేసులో మంత్రి సెంథిల్ బాలాజీ సహా 145 మంది ఎంపీ, ఎమ్మెల్యేలపై ఉన్న కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానం ముందు సోమవారం హాజరయ్యారు. 2011-15 అన్నాడీఎంకే ప్రభుత్వంలో రవాణాశాఖ మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీ.. తన శాఖలో డ్రైవర్, కండక్టర్ పోస్టులు ఇప్పిస్తామని పలువురి వద్ద నగదు తీసుకొని అవినీతికి పాల్పడ్డారని చెన్నై కేంద్ర క్రైం విభాగం పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ కేసులో మంత్రి సెంథిల్ బాలాజీ సహా మొత్తం 2,222 మందిపై నేరారోపణలున్నాయి. ఈ కేసులో తొలివిడతగా మంత్రి సెంథిల్ బాలాజీ సహా 150 మంది నేరుగా హాజరుకావాలంటూ సమన్లు జారీ అయ్యాయి. ఈ కేసు సోమవారం ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసులు విచారిస్తున్న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి సంజయ్‌బాబా విచారించారు. మంత్రి సెంథిల్ బాలాజీ సహా 145 మంది న్యాయమూర్తి ఎదుట హాజరయ్యారు. అనంతరం న్యాయమూర్తి, నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి తరఫున వాదించేందుకు న్యాయవాదులను నియమించుకోవాలని సూచిస్తూ, తదుపరి విచారణకు మరో 150 మంది జనవరి 6,7,8 తేదీల్లో నేరుగా హాజరుకావాలని సమన్లు జారీచేసి, తదుపరి విచారణ వచ్చే నెలకు వాయిదావేశారు.

రహదారుల కమిషన్ ఏర్పాటుకు

గవర్నర్ ఆమోదం



పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల కమిషన్‌లాగే, రాష్ట్రంలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు బిల్లుకు గవర్నర్ ఆర్‌ఎన్ రవి సోమవారం ఆమోదం తెలిపారు. గత ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపించారు. రహదారుల నిర్మాణం, విస్తరణ, పర్యవేక్షణ, అభివృద్ధి తదితరాలకు రాష్ట్ర రహదారుల కమిషన్ ఏర్పాటుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ఈ కమిషన్‌కు ఒక అధ్యక్షుడు, ముగ్గురు శాశ్వత సభ్యులు, ముగ్గురు తాత్కాలిక సభ్యులుంటారు. సభ్యులు 62 ఏళ్ల వరకు పనిచేసేందుకు అవకాశం కల్పించారు. ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ ప్రణాళిక రూపొందించనున్నట్లు ప్రభుత్వం బిల్లులో పేర్కొంది.

గుకేష్‌కు ఘన స్వాగతం

- నేడు ప్రభుత్వం తరపున సన్మానం

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ చెస్ ఛాంపియన్ టైటిల్ సొంతం చేసుకుని భారత్‌కు అగ్రపథాన నిలిపి సోమవారం నగరానికి తిరిగొచ్చిన గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్‌కు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. సింగపూర్ నుంచి ఉదయం 10.45 గంటలకు త్రిశూలం అంతర్జాతీయ విమానాశ్రయానికి గుకేష్ చేరుకోగా ఆయనకు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమీషన్ మెంబర్ సెక్రటరీ మేఘనాథ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా తమిళనాడు చెస్ సంఘం కార్యదర్శి స్టీఫెన్ బాలస్వామి, అయనంబాక్కంలో గుకేష్ చదువుకుంటున్న వేలమ్మాళ్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, కోచ్‌లు, ఆలిండియా చెస్ ఫెడరేషన్ సెక్రటరీ దేవ్ పటేల్, చెస్ క్రీడాకారులు పెద్దసంఖ్యలో గుకేష్‌కు పూలమాలలు వేసి, స్వాగతించి అభినందించారు.


విమానాశ్రయంలో గుకేష్‌ను ఆహ్వానిస్తున్న అతుల్య మిశ్రా, మేఘనాథ రెడ్డి

ఈ సందర్భంగా గుకేష్ మాట్లాడుతూ.. చెన్నై గ్రాండ్ మాస్టర్ చెస్ పోటీలు తనకు మరింత లబ్ధిచేకూర్చాయని, ఇందులో తాను నేర్చుకున్న మెళకువల వల్ల అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనగలిగానన్నారు. అనంతరం తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రటరీ మేఘనాథ రెడ్డి మాట్లాడుతూ.. దేశానికి, రాష్ట్రానికి మరింత ఘనత చేకూర్చిన గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్‌ను రాష్ట్రం తరఫున మంగళవారం సత్కరించనున్నట్లు తెలిపారు. గుకేష్ అభినందన సభలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయ్‌నిధి తదితరులు కూడా పాల్గొంటారని మేఘనాధరెడ్డి తెలిపారు.

బాధితులను ఆదుకోవడంలో

డీఎంకే ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకోవడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. టి.నగర్‌లోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయమైన కమలాలయంలో సోమవారం ఉదయం అన్నామలై అధ్యక్షతన పార్టీ కేంద్ర కమిటీ నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీలంక, బెహ్రైన్ తదితర దేశాల్లోని జైళ్లలో ఖైదీలుగా ఉన్న తమిళుల విడుదలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు, రాష్ట్రంలో బీజేపీ బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలు, 2026లో రాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో స్థానిక పార్టీలతో పొత్తు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల గురించి వాతావరణశాఖ ముందే రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ హైకమాండ్ ఇన్‌ఛార్జులు అరవింద్ మేనన్, పొంగులేటి సుధాకర రెడ్డి, ప్రిసీడియం కార్యదర్శులు కేశవ వినాయగం, సీనియర్లు పొన్ రాధాకృష్ణన్, డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, హెచ్ రాజా, కేపీ రామలింగం, వీపీ దొరైస్వామి, చక్రవర్తి, ఎమ్మెల్యే నాయనార్ నాగేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో నేతలు

సమ సమాజ దార్శనికుడు

బోయి భీమన్న

- ఆచార్య విస్తాలి శంకరరావు

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సమ సమాజ దార్శనికుడు పద్మభూషణ్ బోయి భీమన్న అని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు కొనియాడారు. స్థానిక మెరీనా బీచ్‌లోని వర్సిటీలో సోమవారం బోయి భీమన్న వర్ధంతి సందర్భంగా, ఆ మహనీయుని జీవితం, సాహిత్యంపై ఆచార్య విస్తాలి శంకరరావు ప్రసంగిస్తూ.. తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవి, విమర్శకుడు బోయి భీమన్న అని కొనియాడారు. ఆయన తన సాహిత్య సృష్టితో సామాజిక చైతన్యాన్ని ఆశించి, 84 ఏళ్లలో దాదాపు 70కి పైగా గ్రంథాలు రాసి సాహిత్య చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. సాహితీ వసంతంగా, పద్మశ్రీ, నవయుగ కవి సార్వభౌముడిగా, పద్మభూషణ్ ఇలా బిరుదులు, సత్కారాలు, సన్మానాలు పొంది, ఆదర్శప్రాయంగా బోయి భీమన్న నిలిచారని విస్తాలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. పాండురంగం కాళియప్ప, డా. మాదా శంకరబాబు, డా. జి.దయామణి, స్వరూప, జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య, విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



బోయి భీమన్నకు నివాళులర్పిస్తున్న ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు


సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న బ్రిటన్ డిప్యూటీ రాయబారి హలిమా హాలండ్

కేంద్ర ప్రభుత్వంపై

అన్నదాతల ఆగ్రహం

- రైతు వ్యతిరేక విధానాలకు ఖండన
- తిరుప్పూరు, తంజావూరుల్లో రైల్‌రోకో
- 200 మంది అరెస్టు

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలకు వ్యతిరేకంగా సోమవారం తిరుప్పూరు, తంజావూరు ప్రాంతాల్లో రైతు సంఘాల సమాఖ్య రైల్ రోకో చేపట్టింది. రెండు నగరాల్లో జరిగిన ఈ ఆందోళనలో పాల్గొన్న సుమారు 200 మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు.


తిరుప్పూరు రైల్వేస్టేషన్ వద్ద ఆందోళన

తిరుప్పూరు రైల్వేస్టేషన్ వద్ద సమాఖ్య రాష్ట్ర విభాగం అధ్యక్షుడు షణ్ముగం నాయకత్వంలో మహిళలు సహా సుమారు వంద మంది రైతులు ఆందోళన జరిపేందుకు కుమరన్ విగ్రహం కూడలిలో గుమికూడారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతులకు సరఫరా చేస్తున్న ఉచిత విద్యుత్ రద్దు చేయకూడదని డిమాండ్ చేస్తూ రైలురోకో జరిపేందుకు తిరుప్పూరు రైల్వేస్టేషన్‌కు ఊరేగింపుగా వెళ్లారు. అప్పటికే ఉన్న పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేసి వ్యాన్లలో తరలించారు.

తంజావూరులో..

వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను నిర్ణయిస్తూ ప్రత్యేక చట్టం చేయాలని, రైతు రుణాలను మాఫీ చేయాలని, ఉచిత విద్యుత్ రద్దు చేయకూడదని, పంజాబ్‌లో రైతు సమస్యల పరిష్కారం కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా అధ్యక్షుడు జగ్‌జిత్‌సంగ్ డల్లేవాలతో చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ తంజావూరులో రైతు సంఘాల సమాఖ్య కార్యకర్తలు రైలు రోకో నిర్వహించారు. రైతు సంఘం నాయకులు పీఆర్ పాండ్యన్, తిరుపతి వాండయార్, దురై, భాస్కరన్, ఏకేఆర్ రవిచందర్, సుమారు వందమంది రైతులతో కలిసి తంజావూరు రైల్వేస్టేషన్‌లోకి ప్రదర్శనగా వెళ్ళి తిరుచ్చి నుండి కారైక్కాల్ వెళ్తున్న రైలును ఆపేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అందరూ నినాదాలు చేశారు. రైల్వేపోలీసులు జోక్యం చేసుకుని అందరినీ వ్యాన్లలో తరలించారు. ఈ సంఘటన కారణంగా అరగంటకు పైగా తంజావూరు రైల్వేస్టేషన్‌లో ఉద్రిక్తత నెలకొంది.


తంజావూరులో రైలురోకో చేస్తున్న రైతులు

ఎయిర్‌షోలో సందర్శకుల మృతికి

ఎవరు బాధ్యులు?

- ప్రశ్నించిన నటుడు, బీజేపీ నేత శరత్ కుమార్



చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎయిర్ షోలో అపశృతి జరిగి సందర్శకులు మృతిచెందితే ఎవరిని బాధ్యులను చేశారని సినీ నటుడు, బీజేపీ నేత శరత్ కుమార్ ప్రశ్నించారు. హైదరాబాద్ నగరంలోని సంధ్య థియేటర్ వద్ద 'పుష్ప-2' చిత్రం ప్రీమియర్ ప్రదర్శన సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ చనిపోవడంతో ఈ ఘటనకు సంబంధించి హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడంపై శరత్‌కుమార్ స్పందించారు. ఎయిర్ షోలో అపశృతి జరిగి సందర్శకులు చనిపోతే ఎవరిని బాధ్యులు చేశారని ప్రశ్నించారు. సంధ్య థియేటర్‌కు అల్లు అర్జున్ వస్తారని ముందుగానే స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చివుంటారని పేర్కొన్నారు. అయినప్పటికీ సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో కూడా హీరో అల్లు అర్జున్‌ను బాధ్యుడిని చేయడం భావ్యం కాదని, దీన్ని రాచకొండ సీపీ సుధీర్ బాబు పరిశీలించాలని కోరారు. అలాగే, హీరో మోహన్ బాబు నివాసంలోకి హద్దు మీరి కొందరు ప్రవేశించడం వల్లే ఆ దాడి ఘటన జరిగిందన్నారు. ఆయన మంచి నటుడని, కుటుంబ వివాదంలో మీడియా అత్యుత్సాహం ప్రదర్శించిందని శరత్ కుమార్ విమర్శించారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఆర్‌ఏ పురం, ఎమ్మార్సీ నగర్, పట్టణంబాక్కం, గాంధీ నగర్, పీఆర్వో క్వార్టర్స్, ఆర్కే పురం, ఆర్కే నగర్, రాణి మెయ్యమ్మ టవర్, సత్యదేవ్ అవెన్యూ, ట్రూ వాల్యూ హోమ్స్, రాజా వీధి, రాబర్ట్‌సన్ లైన్, రాజా గ్రామణి గార్డన్, కేవీపీ గార్డన్, అప్పో గ్రామణి వీధి, వేలాయుధరాజా వీధి, డీపీ స్కీమ్ రోడ్డు, రాజా ముత్తయ్యపురం, కుట్టి గ్రామణి వీధి, కామరాజ్ రోడ్డు, షణ్ముగ పురం, శాంతోమ్ హైరోడ్డు, సత్య నగర్, అరింజర్ అన్నానగర్, అన్నై థెరిస్సా నగర్, పెరుమాళ్ ఆలయ వీధి, వెస్ట్ కెనాల్ బ్యాంక్ రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఐఏఎస్ అధికారులకు పదోన్నతి

పెరంబూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులకు పదోన్నతి కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులుజారీచేసింది. అముద, అతుల్ ఆనంద్, సుదీప్‌జైన్, కాకర్ల ఉష, అపూర్వ తదితరులు ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి అదనపు ప్రధాన కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు.

24న కుమరి జిల్లాకు సెలవు

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా 24వ తేది కన్నియాకుమారి జిల్లాకు సెలవు ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ పండుగను ఈ నెల 25వ తేది క్రైస్తవులు జరుపుకోనున్నారు. ఈ క్రమంలో, క్రిస్మస్ ముందు రోజైన 24వ తేది జిల్లాకు సెలవు ప్రకటిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

సాధారణ ఎక్స్‌ప్రెస్‌గా చెన్నై-మైసూరు రైలు

పెరంబూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): చెన్నై-మైసూరు మధ్య నడుపుతున్న సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ జనవరి 3వ తేదినుంచి సాధారణఎక్స్‌ప్రెస్‌గా నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రల్ నుంచి మధ్యాహ్నం 1.35కు బయల్దేరే రైలు రాత్రి 7.55 గంటలకు బెంగళూరు, 10 గంటలకు మైసూరు చేరుకుంటుంది. సెకండ్ క్లాస్ సీటింగ్‌కు రూ.15, చైర్‌కార్‌కు రూ.45 వరకు తగ్గనుందని అధికారులు తెలిపారు.

వినికిడి లోపం ఉన్న వారికి కొత్త కోర్సులు

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం ఉన్న విద్యార్థుల జీవనోపాధి మెరుగుపరిచేలా తరమణి పాలిటెక్నిక్ కళాశాలలో కొత్త కోర్సులు ప్రారంభించారు. ఈ విషయమై ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో... వెల్డింగ్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అమరిక, ఎలక్ట్రానిక్ బోర్డుల టెస్టింగ్‌ల్లో రెండు కొత్త కోర్సులు ప్రారంభించామన్నారు. శిక్షణా కాలం ఆరు నెలలు కాగా, 8,10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో చేరవచ్చని తెలిపింది.

తిరుమూర్తి డ్యాం నుంచి సాగు నీరు విడుదల

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ జిల్లా పరంబికుళం ఆళియారు పథకంలో తిరుమూర్తి డ్యాం నుంచి, పాలారు ఆయకట్టు కింద పొలాలకు సాగు నీరు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... సోమవారం నుంచి జనవరి 10వ తేది వరకు 2వేల ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదల చేయనున్నామని, కోయంబత్తూర్ జిల్లా పొల్లాచ్చి కినత్తుకడవు, సూలూరు తదితర ప్రాంతాలు, తిరుప్పూర్ జిల్లా ఉడుమలైపేట, మడత్తుకుళం, పల్లడం, తిరుప్పూర్, కాంగేయం, తారాపురం తదితర ప్రాంతాల్లో మొత్తం 94,201 ఎకరాలకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

రూ.2.22 కోట్లతో వీధి దీపాలు

పెరంబూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ఈసీఆర్, ఓఎంఆర్ ప్రాంతాలు కలిసిన షోలింగనల్లూర్ మండలంలో రూ.2.22 కోట్లతో వీధి దీపాలు ఏర్పాటుచేయనున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ)లో విలీనమైన ఈ మండలంలో 9 వార్డులున్నాయి. ఈ వార్డుల్లో రోడ్ల విస్తరణ, మరమ్మతులు, డ్రైనేజీ, వాననీటి కాల్వల పనులు జరుగుతున్నాయి. అలాగే, ఈసీఆర్, ఓఎంఆర్, 9 వార్డుల్లో కొత్తగా 242 వీధిలైట్లు ఏర్పాటుకు రూ.2.22 కోట్లు కేటాయించినట్లు, వర్షాకాలం ముగిసిన వెంటనే వీధిదీపాలు ఏర్పాటు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూరు పరిధిలో మంగళవారం విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. పోరూరు చెట్టియారు అగరం రోడ్డులోని ఉప విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు జరిగే శిబిరంలో, పోరూరు పరిధికి చెందిన విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

టీచర్లు, ఉద్యోగులకు తిరుక్కురళ్ పోటీలు

పెరంబూర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రంలో తిరువళ్లువర్ విగ్రహం ఏర్పాటుచేసి 25 ఏళ్ల పూర్తయిన సందర్భంగా సిల్వర్‌జూబ్లీ వేడుకలునిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తమిళ అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో తిరుక్కురళ్ జిల్లాస్థాయి పోటీలు ఈ నెల 21వ తేది నిర్వహించనున్నారు. జిల్లాస్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి 28న విరుదునగర్‌లో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయి. వివరాలకు 9361613548, 8667573086 నెంబర్లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

ఆరంజైనా.... ఆపిలైనా ...

'చెంబరంబాక్కం' తట్టుకుంటుంది

● మంత్రి దురైమురుగన్



చెంబరంబాక్కం జలాశయాన్ని పరిశీలిస్తున్న మంత్రి దురైమురుగన్

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరంజ్ పేరు పెట్టినా, ఆపిల్ పేరు పెట్టినా సరి చెంబరంబాక్కం జలాశయం తట్టుకుంటుందని నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. భారీవర్షాల కారణంగా చెంబరంబాక్కం జలాశయంగా వేగంగా నిండుతోంది. ఈ నేపథ్యంలో, మంత్రి దురైమురుగన్ సోమవారం చెంబరంబాక్కం జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం చెంబరంబాక్కం జలాశయానికి ఏఏ ప్రాంతాల నుంచి నీరు వస్తోంది, విడుదల చేసిన జలాలు ఏఏ ప్రాంతాల మీదుగా అడయారు నదికి చేరుతాయనే వివరాలను ప్రజాపనుల శాఖ అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షాలు లేవని ఎవరూ చెప్పారు. ఆరంజ్ పేరు పెట్టినా, ఆపిల్ పేరు పెట్టినా చెంబరంబాక్కం జలాశయం తట్టుకొనే సామర్థ్యం కలిగి ఉందన్నారు. చెంబరంబాక్కం జలాశయంలో మురిగునీరు కలుస్తోందని పలువురు చెబుతున్నారన్నారు. సాధారణంగా సమాజంలో ఒక సమస్య ఉంది, చెత్తలాంటిదేదైనా జలాశయాల్లోనే వేస్తుంటారు. అంబూరు, వాణియంబాడి ప్రాంతాల్లో చెత్త వేయడం వల్ల పాలారు నది దారుణంగా మారిందని, అందుకు ప్రజల్లో అవగాహన పెరగాలన్నారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో 40 వేలకు పైగా చెరువులున్నాయని, ఒకవైపు జలాశయాల్లో పూడికతీత, మరి కొన్నింటిని పటిష్టపరచే పనులు జరుగుతున్నాయన్నారు. అన్నీ పనులు ఒకసారి చేయడం సాధ్యం కాని పని అని మంత్రి దురైమురుగన్ తెలిపారు. ఆయన వెంట మంత్రి టీఎం అన్బరసన్, కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి మోహన్, ఎమ్మెల్యే సెల్వపెరుందగై తదితరులున్నారు.

సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని మందలింపు

● ప్లస్ వన్ విద్యార్థి ఆత్మహత్య

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలని తల్లిదండ్రులు మందలించడంతో ప్లస్ వన్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మేడవాక్కం శివగామి నగర్ వేలాయుధం వీధికి చెందిన శివశంకర్ (15) ప్లస్ వన్ చదువుతున్నాడు. శివశంకర్ చదువుపై దృష్టి పెట్టకుండా, ఎప్పుడూ సెల్‌ఫోన్‌లో గేమ్ ఆడుతుండడం తల్లిదండ్రులు గుర్తించారు. సెల్‌ఫోన్ తగ్గించి చదువుకోవాలని తల్లిదండ్రులు తెలిపినా అతను పట్టించుకోలేదు. దీంతో, తల్లిదండ్రులు శివశంకర్‌ను గట్టిగా మందలించినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన శివశంకర్, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

గూగుల్ మ్యాప్ తెచ్చిన తంటా !

● బురదలోకి దూసుకెళ్ళిన కారు

టి.నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గూగుల్ మ్యాప్ చూపిన మార్గంలో ఓ డాక్టర్ దంపతులు కారులో వెళ్లి చేతిబిడ్డతో పాటు బురదలో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధర్మపురి జిల్లా నల్లంపల్లికి చెందిన పళనిస్వామి (27), కృత్తిక (27) అదే ఇద్దరు డాక్టర్లు నాలుగు నెలల చంటిబిడ్డ, కృత్తిక బంధువు పావేందర్ (25) అనే డాక్టర్ కలిసి కారులో పళని మురుగన్ ఆలయానికి బయలుదేరారు. కారును పావేందర్ నడిపాడు. ఆదివారం వేకువజామున ఆ కారు కరూరు - దిండుగల్ ఫోర్‌వేలో తమ్మనపట్టి ఫ్లైఓవర్ దాటింది. అక్కడి నాలుగురోడ్ల కూడలిలో కారు ఎటువైపు నడపాలో తెలియక పావేందర్ గూగుల్ మ్యాప్ ఆన్ చేశారు. ఆ మ్యాప్ ద్వారా వచ్చిన మెసేజ్ ప్రకారం కారును కుడి వైపు తిప్పారు. ఆ కారు బురదగా ఉన్న మట్టిరోడ్డులో చిక్కుకుంది. ముందుకు, వెనుకకు కదలలేక బురదలో కారు కూరుకుపోయింది. వేకువజాము కావటంతో ఆ మార్గంలో జనసంచారం కూడా లేకపోవడంతో పళనిస్వామి, పావేందర్, కృత్తిక ముగ్గురూ కలిసి కారును కదిల్చేందుకు ప్రయత్నించినా కుదరలేదు. అగ్నిమాపక శాఖ అధికారులకు ఫోన్ చేయడంతో వేడచందూరు నుండి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని కారును బురదలో నుంచి బయటకు తీశారు. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన మార్గంలో ప్రయాణించిన ఆ డాక్టర్లు చివరకు పళని క్షేత్రానికి చేరుకున్నారు.

గల్లంతైన విద్యార్థినుల మృతదేహాలు లభ్యం

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దిండివనం సమీపం కొంజిమంగళం నదిలో ఆదివారం గల్లంతైన మరో ప్లస్ టూ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. పుదుకుప్పం గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు నదిలో స్నానం చేస్తుండగా, వరద ఉధృతిలో చిక్కుకొని నర్మద, అనుశ్రీ కొట్టుకుపోయారు. వారు స్నానం చేస్తున్న కి.మీ దూరంలో కొట్టుకుపోతున్న నర్మదను రక్షించిన స్థానికులు, ఆమెను పుదువై జిప్మర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. గల్లంతైన మరో విద్యార్థిని అనుశ్రీ కోసం గాలిస్తున్న నేపథ్యంలో, సోమవారం ఉదయం ఆమె మృతదేహం లభ్యమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ కరెన్సీతో ఒకరి అరెస్ట్

ఐసిఎఫ్, డిసెంబరు 16: నకిలీ కరెన్సీ ఉంచుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్టుచేశారు. తిరునల్వేలి జిల్లా పాపనాశం మరుదంనగర్‌కు చెందిన మహమ్మద్ ఇబ్రహీం కుమారుడు మహమ్మద్ సమీర్ అదే ప్రాంతంలో కూరగాయల దుకాణం నడుపుతున్నాడు. ఈ క్రమంలో, అన్నానగర్‌కు చెందిన ఆశైతంబి రోజూ సమీర్ దుకాణంలో కాయగూరలు కొనుగోలు చేస్తుంటాడు. ఆదివారం కూడా దుకాణానికి వచ్చిన కూరగాయలు కొనుగోలు చేసిన ఆశైతంబి దానికి నగదు చెల్లించి వెళ్లిపోయాడు. కొంతసేపటికి ఆశైతంబి ఇచ్చిన రూ.100 నోటు పరిశీలించిన సమీర్, అది నకిలీదిగా గుర్తించి విక్రమ్‌సింగ్ పురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆశైతంబి ఇంటికి వెళ్లి తనిఖీచేసి, రూ.100 నకిలీ నోట్లు, జెరాక్స్ యంత్రాన్ని స్వాధీనం చేసుకొని, ఆశైతంబిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

130 గంజాయి చాక్లెట్లు స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జామ్ బజార్‌లో 130 గంజాయి చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అన్నాసాలై జామ్‌బజార్ కుప్పముత్తు వీధిలో చట్టవిరుద్ధంగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు కీల్పాక్కం పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం మారువేషంలో ఆ ప్రాంతంలో గస్తీ చేపట్టిన పోలీసులు ఓ దుకాణంలో గంజా చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో అదే ప్రాంతానికి చెందిన రాజేష్‌ను అరెస్ట్ చేసి, అతడి నుంచి 730 గ్రాముల 130 చాక్లెట్లు, 420 గ్రాముల మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

నాలుకపై టాటూ: ఇద్దరి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలోని టాటూ సెంటర్‌లో నాలుకపై టాటూ వేసిన ఘటనలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం యువత తమ శరీరంపై టాటూలు వేసుకోవడం ఫ్యాషన్‌గా మారింది. టాటూ సెంటర్లనీ యువతతో కిటకిటలాడుతున్నాయి. టాటూలు వేసుకోవడం ద్వారా శరీరం దెబ్బతింటుందని వైద్యులు చెబుతున్నా యువత పట్టించుకోవడం లేదు. తాజాగా నాలుకపై టాటూ వేసుకొనే కొత్త విధానం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుతో తిరుచ్చిలోని టాటూ సెంటర్ నిర్వాహకులు హరికరన్, జయరామన్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

శ్రీలంక జైళ్లలో 141 మంది తమిళ జాలర్లు

● కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్

ఐసిఎఫ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్లలో 141 మంది తమిళ జాలర్లు బందీలుగా ఉన్నారని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ సుధ అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి బదులిస్తూ... తమిళనాడుకు చెందిన 198 పడవలను స్వాధీనం చేసుకున్న శ్రీలంక ప్రభుత్వం, అరెస్ట్ చేసిన 141 మంది జాలర్లలో 96 మంది శిక్ష విధింపబడి ఉన్నారని తెలిపారు. జాలర్లను విడిపించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కేంద్ర మంత్రి తెలిపారు.

పళవేర్కాడులో పడవబోల్తా

● జాలర్లకు తప్పిన ముప్పు



బండరాళ్లపై పడి విరిగిన పడవ

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీపంలోని పళవేర్కాడు ముఖద్వారం వద్ద చేపలు పట్టే నాటు పడవ అలల తాకిడికి బోల్తాపడి రెండు ముక్కలైంది. అదృష్టవశాత్తూ ఆ పడవలోని ముగ్గురు జాలర్లు ప్రాణాలతో బయటపడ్డారు. పళవేర్కాడు ప్రాంతంలో గత రెండు రోజులుగా అలల ఉధృతి అధికంగా ఉంది. ఆ ప్రాంతంలోని వైరవన్‌కుప్పం గ్రామానికి చెందిన ఇళంగో అనే జాలరి, జానకిరామన్, సుందర్ అనే జాలరితో కలిసి సోమవారం పళవేర్కాడు ముఖద్వారం వద్ద చేపలు పడుతుండగా ఉన్నట్టుండి రాక్షస అలలు ఆ పడవపై ఎగిసిపడ్డాయి. దీంతో ఆ పడవ నీటిలో బోల్తాపడింది. పడవలో ఉన్న 80 కేజీల వలలు, ఇతర సామగ్రి నీటిలో కొట్టుకుపోయింది. ముగ్గురు జాలర్లు ఈదుకుంటూ ఒడ్డుకు చేరారు. నీటిలో బోల్తాపడిన ఆ పడవ గాలికి ఎగిరి బండరాళ్లపై పడి రెండు ముక్కలైంది. ఈ సంఘటనపై తిరుప్పాలైవనం పోలీసులు, మత్స్యశాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.

చెరువుకు నీరు చేరాలని పూజలు



దీపాలు వెలిగించిన గ్రామస్తులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూర్ సమీపం వెల్లకోవిల్ సమీపం ఉత్తమపాళయంలో ఉన్న వట్టమలై చెరువుకు నీరు రావాలని కోరుతూ 10,008 దీపాలు వెలిగించి గ్రామస్తులు పూజలు చేశారు. 1980లో పరంబికుళం-ఆళియారు సమగ్ర సాగునీటి ప్రాజెక్ట్‌లో భాగంగా ఈ చెరువు నిర్మించారు. 2021లో డ్యాం నుంచి నీరు విడుదల చేయడంతో ఈ చెరువు పూర్తిగా నిండింది. అనంతరం ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో చెరువు ఎండిపోయింది. ఈ నేపథ్యంలో, చెరువుకు నీరు అందేలా కరుణించాలంటూ గ్రామస్తులు దీపాలు వెలిగించి కులదేవతకు పూజలు చేశారు.

ఆస్పత్రిలో చేరిన మాజీ డీజీపీ



మాజీ డీజీపీ వాల్టర్ దేవారం

టి.నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మాజీ డీజీపీ వాల్టర్ దేవారం తీవ్ర అస్వస్థతకు గురై కీల్పాక్ వైద్య కళాశాల (కేఎంసీ) ఆస్పత్రిలో చేరారు. దేవారం పోలీసుశాఖలో చేరటానికి ముందు సైనికాధికారిగా పని చేశారు. వేలూరు సర్కిల్ డీఐజీ, ఇంటెలిజెన్స్ అధికారిగా ఉన్నప్పుడు నక్సలైట్లను అణచివేసి పాలకుల ప్రశంసలందుకున్నారు. రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షుడిగాను సేవలందించారు. 1997 జూలై 31న డీజీపీగా పదవీ విరమణ చేశారు. 85 ఏళ్ల దేవారం చెట్‌పేట్‌లోని నివాసంలో ఉంటున్నారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ తరచూ ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నారు. ఈనేపథ్యంలో ఆదివారం దేవారం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటుండగా ఊపిరాడక తీవ్రఇబ్బంది పడ్డారు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కేఎంసీకి తరలించారు. వైద్యనిపుణులు ఆయనను అత్యవసర చికిత్సా విభాగంలో చికిత్స అందిస్తున్నారు.

గర్భాలయంలోకి ఎవరికీ ప్రవేశం లేదు

● నటి కస్తూరి

అడయార్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏ ఒక్క ఆలయంలో కూడా గర్భాలయంలోకి ఎవరికీ ప్రవేశం లేదని సినీ నటి కస్తూరి అభిప్రాయపడ్డారు. శ్రీవిల్లిపుత్తూరులోని ఆండాల్ ఆలయంలో సంగీత దర్శకుడు ఇళయరాజాకు అవమానం జరిగిందంటూ జరిగిన ప్రచారంపై ఆమె సోమవారం మీడియాతో మాట్లాడారు. ఆలయానికి వెళ్ళిన ఇళయరాజాకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టువస్త్రం, ప్రసాదాలను అందజేశారన్నారు. ఇళయరాజాకే కాదు ఏ ఒక్కరికీ గర్భాలయంలోకి ప్రవేశించేందుకు అనుమతి లేదని, అందువల్ల ఇళయరాజాకు ఆండాల్ ఆలయంలో ఎలాంటి అవమానం జరగలేదని ఆమె స్పష్టం చేశారు.

శ్రీపెరుంబుదూరు జీయర్‌పై విమర్శలు

● ఆధ్యాత్మిక ప్రవచనకర్త రంగరాజన్ అరెస్టు



శ్రీరంగం రంగరాజన్

టి.నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీపెరుంబుదూరు జీయర్ స్వామిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన తిరుచ్చి జిల్లా శ్రీరంగం ప్రాంతానికి చెందిన రంగరాజన్ నరసింహన్ అనే ఆధ్యాత్మిక ప్రవచనకర్తను పోలీసులు అరెస్టు చేశారు. రంగరాజన్ 'మన దేవాలయాలు' పేరిట యూట్యూబ్ ఛానల్ నడుపుతున్నాడు. ఇటీవల తన ఛానల్‌లో శ్రీపెరుంబుదూరు జీయర్ స్వామిని కించపరిచేలా విమర్శలు చేశారు. దీంతో జీయర్ స్వామి గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ అరుణ్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం పోలీసులు రంగంలోకి దిగి విచారణ జరిపారు. రంగరాజన్ నరసింహన్ శ్రీపెరుంబుదూరు జీయర్‌స్వామిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో చెన్నై సైబర్ క్రైం పోలీసులు శ్రీరంగానికి వెళ్లి రంగరాజన్ అరెస్టు చేశారు.

తెన్‌పెన్నై నదిలో పిల్లల మృతదేహాలు

ఐసిఎఫ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలోని తెన్‌పెన్నై నదిలో ఇద్దరు పసికందుల మృతదేహాలు కొట్టుకురావడం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. ఇటీవల కురిసిన వర్షాలకు తెన్‌పెన్నై నదికి వరద ఉధృతి వచ్చింది. అలాగే, నది తీరప్రాంత గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ఈ క్రమంలో, సోమవారం ఉదయం తీరానికి కొట్టుకొచ్చిన కొన్ని సంచులను పరిశీలించిన స్థానికులు, వాటిలో ఇద్దరు పసికందుల మృతదేహాలు గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. సమాచారం అందుకున్న కడలూరు పుదునగర్ రెడ్డిచావిడి పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మున్సిపాలిటీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

వేలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలో మున్సిపాలిటీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే అమ్ములు ప్రారంభించారు. గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు, డీఎంకే సెక్రటరీ సౌందరరాజన్, మున్సిపల్ కమిషనర్ మంగైకరసన్, కౌన్సిలర్ మోహన్, జనరల్ కమిటీ సభ్యుడు శక్తిదాసన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై నుంచి బ్యాంకాక్‌కు అదనపు విమానం

అడయార్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌కు అదనపు విమాన సర్వీసు సోమవారం నుంచి ప్రారంభమైంది. పర్యాటక, పారిశ్రామిక నగరంగా ప్రసిద్ధిగాంచిన బ్యాంకాక్ వెళ్లే వారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దీంతో చెన్నై - బ్యాంకాక్ మధ్య విమాన సర్వీసుల్లో రద్దీ పెరిగింది. ఈ నేపథ్యంలో కేథే పసిఫిక్ ఎయిర్‌లైన్స్ కొత్తగా విమాన సర్వీసు ప్రారంభించింది. 330-300 రకం విమాన సర్వీసును ప్రతి రోజూ ఉదయం చెన్నై నుంచి బ్యాంకాక్‌కు బయలుదేరి వెళ్తుంది.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ 324ఎం జిల్లా ఆధ్వర్యంలో పలువురు పేద విద్యార్థులకు లయన్స్ క్లబ్ సౌత్ సిటీ అధ్యక్షురాలు డాక్టర్ ఏవీ శివకుమారి ఆర్థిక సాయం చేశారు. ఈ ఆర్థిక సాయం చెక్కులను అర్హులైన పేద విద్యార్థులకు రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ సభ్య కార్యదర్శి, ఐఏఎస్ అధికారి జె.మేఘనాథ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సౌత్ సిటీ సభ్యురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారని శివకుమార్ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నెల్లికుప్పంలో వరదసాయం కోరుతూ

సర్పంచుల సహా బాధితుల రాస్తారోకో



నెల్లికుప్పం వద్ద రాస్తారోకో చేస్తున్న సర్పంచ్‌లు, వరదబాధితులు

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా నెల్లికుప్పం వద్ద సోమవారం ఉదయం ప్రభుత్వ సాయం కోరుతూ 12 మంది పంచాయతీ సర్పంచ్‌లు సహా బాధితులు రాస్తారోకో నిర్వహించారు. ఆ జిల్లాలో ఫెంగల్ తుఫాన్, బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా కుండపోతగా కురిసిన వర్షాలకు వేలాదిమంది ఇళ్లను కోల్పోయారు. సుమారు రెండు వందల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. ఆ జిల్లాలో వరద బాధితులందరికి రూ.2వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అన్నాగ్రామ పంచాయతీ యూనియన్ పరిధిలోని 12 గ్రామాల్లో ఇంకా ఆ సాయం అందలేదు. దీంతో ఆగ్రహం చెందిన సర్పంచ్‌లు, గ్రామస్థులు రాస్తారోకో జరిపారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు, పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్ళి ఆందోళనకారులతో చర్చలు జరిపి, వారిని శాంతింపజేశారు. ఇటీవల అన్నా పంచాయతీ యూనియన్ డీఎంకే కార్యదర్శి వెంకటరామన్ ఇతర పార్టీ ప్రముఖులు కడలూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి వరద సాయం వీలైనంత త్వరగా ఇవ్వాలని కోరుతూ వినతిపత్రాలు సమర్పించారు. అయినా అధికారులు స్పందించకపోవడంతో నెల్లికుప్పం పాలూరు రహదారిలో 12 గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఆ గ్రామాల ప్రజలు రాస్తారోకో జరిపారు.

తిరుమావళవన్‌పై ఎలాంటి ఒత్తిడి చేయలేదు

● మంత్రి ఏవీ వేలు

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న వేడుకలో డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్ పాల్గొనకూడదని డీఎంకే ఎలాంటి ఒత్తిడి చేయలేదని మంత్రి ఏవీ వేలు స్పష్టం చేశారు. మదురై గోరిపాళయం మేలమడై జంక్షన్‌లో ఫ్లై ఓవర్ నిర్మాణపనులను ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల కోసం ప్రజలు ఫిర్యాదు చేసేలా 'నమ్మ సాలై' అనే యాప్ పరిచయం చేశామన్నారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనకూడదని డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్‌పై తాము ఎలాంటి ఒత్తిడి చేయలేదని, అలాంటి ఒత్తిళ్లకు తలొగ్గే వ్యక్తి తిరుమావళవన్ కాదని మంత్రి స్పష్టం చేశారు.

గిరి ప్రదక్షిణ మార్గంలో చెత్త తొలగింపు



చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ భాస్కర పాండ్యన్

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో 4వేల మంది పారిశుధ్య కార్మికులు సోమవారం ఉదయం వరకు 250 టన్నుల చెత్త సేకరించినట్లు కలెక్టర్ భాస్కర పాండ్యన్ తెలిపారు. ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయ కార్తీక దీపోత్సవాల్లో భాగంగా కొండ శిఖరంపై మహా దీపం వెలిగించే కార్యక్రమం ఈ నెల 13న జరిగింది. అలాగే, పౌర్ణమి ఘడియలు శనివారం ప్రారంభమై ఆదివారం మధ్యాహ్నం వరకు కొనసాగాయి. ఆలయం చుట్టూ ఉన్న 14 కి.మీ గిరి ప్రదక్షిణ మార్గంలో లక్షలాదిమంది పాల్గొన్నారు. ఈనేపథ్యంలో, గిరిప్రదక్షిణ మార్గంలో భక్తులు వేసిన వస్తువులు, వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగిస్తున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాట్పాడి డివిజన్ సేర్కాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యసేవలు, మౌలిక వసతులు తదితరాలను పేషంట్ల ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీర్ శ్రీనివాసన్, కాట్పాడి తహసీల్దార్ జగదీశ్వరన్, బీడీఓలు నందకుమార్, కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కనియంబాడి పంచాయతి యూనియన్ పరిధిలోని ముస్‌జార్‌పట్టులో లబ్ధిదారులకు ఉచిత ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేసే శిబిరాన్ని ప్రారంభించారు.

● ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు..

ఇద్దరి అరెస్టు, నాటు తుపాకీ స్వాధీనం

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో నగర పోలీసులు ఇద్దరిని అరెస్టు చేయగా, నాటు తుపాకీతో పాటు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో 28 మంది అరెస్టు చేసిన విషయం తెల్సిందే. ఈ కేసులో కార్తికేయన్ అనే వ్యక్తిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. అతడిచ్చిన సమాచారం మేరకు అరుంబాక్కం ఎంఎండీఏ కాలనీకి చెందిన తమిళరసన్ (30), మధురవాయల్ ఆలపాక్కంకు చెందిన మణికంఠన్ (28) అనే వారిని పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి నాటు తుపాకీతో పాటు నాలుగు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

అమ్మా క్యాంటీన్‌కు సీలు

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువత్తియూర్ ఎల్లయమ్మాళ్ కోవెల వీధి వాణిజ్య సముదాయ భవనంలో ఉన్న అమ్మా క్యాంటీన్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. ఎల్లయమ్మాళ్ కోవెల వీధిలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల వంద పడకలతో ఆధునీకరించారు. ఈ ఆస్పత్రి సమీపంలో 30 ఏళ్లుగా జీసీసీ వాణిజ్య సముదాయ భవనంలో 35కు పైగా షాపులున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రికి రోగులను తరలించే అంబులెన్స్ వాహనాలు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో ఆ వాణిజ్య సముదాయ భవనాన్ని కూల్చివేయాలని జీసీసీ నిర్ణయించింది. దీంతో షాపుల వ్యాపారులు జీసీసీకి వ్యతిరేకంగా మద్రాసు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం ఉదయం జీసీసీ అధికారులు వాణిజ్య సముదాయ భవనంలో ఉన్న అమ్మా క్యాంటీన్ సహా అన్ని షాపులను మూసి వేసి సీలు వేశారు. ఈ సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న అన్నాడీఎంకే కార్పొరేటర్ డాక్టర్ కార్తిక్ నేతృత్వంలో వ్యాపారులు, కార్యకర్తలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనాకారులను అక్కడి నుండి వెల్లగొట్టారు.

కుటుంబ తగాదాలతో దంపతుల ఆత్మహత్య

● చిదంబరంలో భార్య.. సింగపూర్‌లో భర్త



పన్నీర్‌సెల్వం, గౌరీ (ఫైల్‌ఫొటో)

చెన్నై,డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడలూరుకు చెందిన దంపతులు కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నారు. ఆ భార్యాభర్తలు తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా ఇద్దరు కుమార్తెలు పిన్నవయస్సులోనే అనాథలయ్యారు. వివరాలిలా వున్నాయి... కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని ఆద్యనల్లూరు గ్రామానికి చెందిన పన్నీర్‌సెల్వానికి శ్రీముష్ణం సమీపం కుల్లతకురిచ్చి ప్రాంతానికి చెందిన గౌరి అనే యువతితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి నిత్తిషా (4), నిటీషా (2) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. పన్నీర్‌సెల్వం సింగపూరులో పనిచేస్తూ సెలవుల్లో స్వస్థలానికి వచ్చి భార్యాపిల్లలతో గడిపి వెళుతుండేవారు. పన్నీర్‌సెల్వం సింగపూరు నుంచి వచ్చినప్పుడల్లా భార్యతో గొడవపడుతుండేవాడు. ఈ గొడవలు తట్టుకోలేక ఆమె తరచూ పుట్టింటికి వెళ్లేది. నాలుగు నెలల క్రితం పన్నీర్‌సెల్వం ఇంటికొచ్చి మద్యం తాగి ఆమెతో గొడవపడ్డాడు. కొంతమంది పెద్దలు రాజీ కుదిర్చిన తర్వాత వారి కాపురం సాఫీగా సాగింది. ఈ నేపథ్యంలో గత శనివారం గౌరీ తన చెల్లెలు, తండ్రితో వీడియో కాల్ చేసి మాట్లాడింది. ఆ తర్వాత సింగపూర్‌లో ఉన్న భర్త పన్నీర్‌సెల్వంతో వీడియోకాల్‌లో మాట్లాడినప్పుడు ఏదో విషయమై ఇరువురూ తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. తరువాత గౌరి ఇంటిలో ఎవరూ లేని సమయంలో గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అది చూసి ఆమె కుమార్తెలు భయంతో ఏడ్వడటంతో చుట్టుపక్కలవారు పరుగెత్తుకెళ్ళారు. గౌరి ఉరికి వేలాడుతుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెళ్లి విచారణ చేపట్టారు. ఆ సమయంలో సింగపూర్‌లో ఉన్న పన్నీర్‌సెల్వంకు పోలీసులు ఫోన్ చేసి గౌరీ ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలిపారు. అది విని పన్నీర్‌సెల్వం కూడా .. తానున్న గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ విషయం తెలుసుకున్న ఇరువురి కుటుంబీకులు శోకతప్తులయ్యారు.



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

సాక్షి అగర్వాల్ ప్రధాన పాత్రలో
సైన్స్ ఫిక్షన్ మూవీ

సాక్షి అగర్వాల్ ప్రధాన పాత్రలో సైన్స్ ఫిక్షన్ జానర్‌లో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు సోమవారం నగరంలో జరిగాయి. పి.హరి రచనా సహకారం అందించి, డాక్టర్ అరుణ్ ప్రసాద్ నిర్మాణంలో నిర్మితమయ్యే ఈ చిత్రానికి పి.హరి దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టారు. ఇందులో సాక్షి అగర్వాల్, అరుణ్ ప్రసాద్, శ్రీనివాసన్, దీపిక తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. మరో ప్రముఖ హీరోయిన్ కీలక పాత్ర పోషించనున్నారు. సైన్స్ ఫిక్షన్ జానర్‌లో రూపొందే ఈ సినిమా తమిళ చిత్రపరిశ్రమలో ఇప్పటివరకు చూడని విభిన్నమైన కథాంశంతో ది స్ట్రింగర్, ఎమర్జింగ్ టెక్నాలజీ సాయంతో ప్రపంచస్థాయి సాంకేతికతతో నిర్మించనున్నారు. ఇందుకోసం ముంబైకు చెందిన ఫీనిక్స్ ఫిల్మ్ మేకర్ స్టూడియో సీజీఐ, వీఎఫ్ఎక్స్ పనులను పూర్తి చేయనుంది. గ్రహాంతరవాసితో పాటు ఇతర జంతువులు, కథాంశాలు, ప్రేక్షకులకు విజువల్ ట్రీట్‌గా ఉంటాయని దర్శకుడు పి.హరి వెల్లడించారు.

ఘనంగా శంకరదాస
గురుపూజోత్సవం

● పాల్గొన్న నటుడు సౌందరరాజా



జ్ఞాపిక అందిస్తున్న సౌందరరాజా

మదురైలో జరిగిన శంకరదాస స్వామి 102వ గురుపూజకు ప్రముఖ నటుడు సౌందరరాజా పాల్గొన్నారు. కొన్నేళ్ళుగా తమిళ చిత్రపరిశ్రమలో విభిన్న పాత్రలను పోషిస్తూ తనకంటూ ఓ గుర్తింపు, ఇమేజ్‌ను సొంతం చేసుకున్న సౌందరరాజా... దక్షిణ భారత నటీనటుల సంఘం (నడిగర్ సంఘం)కు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా కూడా కొనసాగుతున్నారు. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే, తన సంపాదనలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ప్రధానంగా అనేక మంది పేదలకు నిత్యం ఆకలి తీర్చడం, పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా మొక్కలు నాటడం వంటి పనులు చేస్తూ చిత్రపరిశ్రమలోనే కాకుండా, సమాజంలో కూడా మంచిపేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మదురైలో జరిగిన శంకరదాస స్వామి 103వ గురుపూజోత్సవంలో నడిగర్ సంఘం తరపున సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్‌తో కలిసి సౌందరరాజా కూడా పాల్గొన్నారు. ఈ వేడుక మదురై రంగస్థల నటీనటుల సంఘం ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో నాటక సంఘ నిర్వాహకులతో పాటు సభ్యులు అనేక మంది పాల్గొని విజయవంతం చేశారు. కాగా, తమిళ నాటక రంగ పితామహుడుగా, తమిళ నాటకరంగ పునరుజ్జీవనకర్తగా పేరొందిన శంకరదాస 30 ఏళ్ళకుపైగా తమిళ నాటకరంగాన్ని తన శ్వాసగా భావించారు. ఈ క్రమంలో ఆయన 63కు పైగా నాటకాలను ప్రదర్శించారు. ఆయన 1922లో నవంబరు నెలలో పుదుచ్చేరిలో తుది శ్వాస విడిచారు.

'జయం' సరసన డీజీపీ కుమార్తె



జయం రవి - దౌదీ జీవాల్

చిత్రజ్యోతి

హీరో జయం రవి సరసన రాష్ట్ర డీజీపీ శంకర్ జీవాల్ కుమార్తె దౌదీ జీవాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. స్క్రీన్ సీన్ మీడియా పతాకంపై ఆరుముగం నిర్మించే జయం రవి 34వ చిత్రం ప్రారంభోత్సవం తాజాగా నగరంలో జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి అభినందనలు తెలిపింది. 'బ్రదర్' మూవీ తర్వాత జయం రవి నటించిన 'కాదలిక్క నేరమిల్లై', 'జెని' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జయం రవి తన 34వ చిత్రాన్ని 'డాడా' ఫేం గణేష్ కె.బాబు దర్శకత్వంలో రూపొందించనున్నారు. ఇందులో హీరోయిన్‌గా ప్రస్తుతం రాష్ట్ర డీజీపీగా ఉన్న శంకర్ జీవాల్ కుమార్తె దౌదీ జీవాల్‌ను ఎంపిక చేశారు. అలాగే, 'బ్రదర్' మూవీ తర్వాత హారీస్ జయరాజ్ - జయం రవి మరోమారు కలిసి పనిచేయనున్నారు. ఇందులో సీనియర్ దర్శకుడు పి.వాసు కుమారుడు శక్తి ప్రతినాయకుడి పాత్ర పోషిస్తున్నారు. మరోవైపు, సుధ కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్ నటించే 'పురనానూరు' మూవీలోనూ జయం రవి నటిస్తున్న విషయం తెల్సిందే.



హోటల్ కొనుగోలు అవాస్తవం

● విఘ్నేష్ శివన్

పుదుచ్చేరిలో ప్రభుత్వ హోటల్ కొనుగోలు చేస్తున్నాననే ప్రచారంపై సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్ స్పందించారు. తాను ఎలాంటి ప్రభుత్వ ఆస్తులు కొనుగోలు చేయలేదని, సినిమా షూటింగు కోసం లొకేషన్ ఎంపిక కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించినట్టు వివరణ ఇచ్చారు. పుదుచ్చేరిలో ఒక ప్రభుత్వ హోటల్‌ను కొనుగోలు చేసేందుకు విఘ్నేష్ శివన్ ధర అడిగినట్టు వార్తలు వచ్చాయి. వీటిపై ఆయన తాజాగా స్పందించారు. 'పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన హోటల్ కొనుగోలు చేయడానికి ధర అడగలేదు. సినిమా షూటింగ్ అనుమతి కోసం రాష్ట్ర అధికారులను కలిశాను. నేను దర్శకత్వం వహిస్తున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (ఎల్ఐసీ) షూటింగు పుదువై ఎయిర్‌పోర్టులో నిర్వహించాలని ప్లాన్ చేశాం. ఇందుకోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యాటక శాఖామంత్రిని మర్యాదపూర్వకంగా కలిశాను. ఆ తర్వాత స్థానిక ప్రముఖుడు ఒకరు కొన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీటిని నేను అడిగినట్టుగా నాకు అన్వయించారు. సోషల్ మీడియాలో మాత్రం ప్రభుత్వ హోటల్ కొనుగోలు చేయబోతున్నట్టు మీమ్స్ వచ్చాయి. వీటిలో రవ్వంత నిజం కూడా లేదు. నా గురించి జరుగుతున్న ప్రచారంపై వివరణ ఇవ్వడం జరిగింది' అని పేర్కొన్నారు.

రూ.17.35 కోట్లతో
చెట్‌పెట్ ఎకో పార్క్ ఆధునికీకరణ





చెట్‌పేట్ ఎకో పార్క్ ప్రవేశద్వారం - పార్క్‌లో పడవ సవారీ

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెట్‌పేట్ ఎకో పార్క్‌ను రూ.17.35 కోట్లతో ఆధునికీకరించనున్నారు. నగర ప్రజలు సేదతీరేందుకు ప్రధానంగా మెరీనా బీచ్ మాత్రమే ఉంది. పడవ సవారీ తదితర వినోద కార్యక్రమాలకు వెళ్లాలనుకొనే వారు, మహాబలిపురం సమీపంలోని ముట్టుకాడు పర్యాటక ప్రాంతానికి వెళుతుంటారు. ఈ నేపథ్యంలో, చెట్‌పేట్‌లో 16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును రూ.48 కోట్లతో ఎకో పార్క్‌గా మార్చి 2016లో అప్పటి ముఖ్యమంత్రి జయలలిత ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర మత్స్య అభివృద్ధి కార్పొరేషన్ పర్యవేక్షణలో ఉన్న ఈ పార్క్‌లో పడవ సవారీతో పాటు పిల్లలకు క్రీడా మైదానం, చేపల ప్రదర్శన, 3డీ హాలు, హోటళ్లు ఏర్పాటుచేశారు. ఈ పార్క్ వృక్షాలతో అందమైన రిజర్వాయర్‌తో కూడుకొని ఉంది. ఈ క్రమంలో, 2016లో సంభవించిన 'వర్దా' తుఫాను కారణంగా పార్క్ దెబ్బతినగా, మళ్లీ పునరుద్ధరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

తగ్గిన పర్యాటకులు...

పార్క్ ప్రారంభించిన తొలిరోజుల్లో ప్రజలు అధికంగా వచ్చారు. అనంతరం ప్రజల రాక క్రమక్రమంగా తగ్గుతూ ప్రస్తుతం నిర్మానుష్యంగా కనిపిస్తోంది. పార్క్ చుట్టుపక్కల ఉన్న వారు మాత్రమే వాకింగ్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ పార్క్ ఆధునీకరించాలని సీఎండీఏ నిర్ణయించింది. మ్యూజికల్ ఫౌంటైన్, ఆధునిక బోట్ డాక్, లేక్ వ్యూ రెస్టారెంట్, వ్యాయామశాల, రీడింగ్ రూమ్, వివిధ రకాల క్రీడా మైదానాలతో ఈ పార్క్ ఆధునీకరణకు ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో రూ.17.35 కోట్లు కేటాయించారు. 2025 జనవరి నుంచి పనులు ప్రారంభించి డిసెంబరులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

చిదంబరంలో రథాలకు కొత్త మోకుతాళ్లు



కొత్త మోకుతాళ్లను ఆలయ వీధుల్లో ఊరేగిస్తున్న దీక్షితార్లు, భక్తులు

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం నటరాజస్వామి ఆలయానికి చెందిన పంచ రథాలకు రూ.6లక్షల విలువైన మోకుతాళ్లను ఓ హోటల్ యజమాని కానుకగా సమర్పించారు. ఆ మోకుతాళ్లను ఆలయ ప్రధాన వీధుల్లో ఊరేగించి ఆలయ నిర్వాహకులకు అందించారు. చిదంబరం ఆలయంలో ప్రతియేటా రెండు సార్లు రథోత్సవాలు నిర్వహిస్తారు. ఆ సమయాల్లో నటరాజస్వామి, శివకామసుందరం, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వర స్వామిని వేర్వేరు రథాల్లో ఊరేగిస్తారు. ఈ నేపథ్యంలో ఆ ఐదు రథాలకు చెందిన మోకుతాళ్లు పాతబడిపోవటంతో నటరాజస్వామి భక్తుడైన ప్రముఖ హోటల్ యజమాని మోహన్ రూ.6లక్షలతో శివగంగ జిల్లా సింగంపునరిలో మూడు మోకుతాళ్లను తయారు చేయించారు. లారీలో తీసుకువచ్చిన ఆ మోకుతాళ్లకు ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత ప్రధాన వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. చివరగా మోకుతాళ్లను ఆలయ ప్రధాన దీక్షితార్ల వద్ద అప్పగించారు. వచ్చే యేడాది జనవరి 12న నిర్వహించనున్న రథోత్సవంలో ఈ మోకుతాళ్లను ఉపయోగించనున్నట్లు ఆలయ దీక్షితార్లు పేర్కొన్నారు.

ట్రెక్కింగ్ ఛార్జీల్లో 25 శాతం తగ్గింపు



పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 40 మార్గాల్లో ట్రెక్కింగ్ ఛార్జీలు 25 శాతం తగ్గించారు. తేని జిల్లా కురంగణి కొండల్లో 2018లో సంభవించిన అగ్నిప్రమాదంలో టెక్కింగ్‌కు వెళ్లిన 23 మంది మత్యువాతపడ్డారు. ఈ ఘటన కారణంగా రాష్ట్రంలో ట్రెక్కింగ్‌కు అటవీ శాఖ నిషేధం విధించింది. ఆరేళ్ల అనంతరం పలు నిబంధనలు, కొత్త మార్గదర్శకాలతో ట్రెక్కింగ్ మళ్లీ అనుమతులిచ్చారు. అటవీ శాఖ 'ఆన్‌లైన్ ట్రెక్కింగ్ ట్రైల్ అట్లాస్' ద్వారా 40 ట్రెక్కింగ్ మార్గాల కోసం అనే వెబ్‌సైట్ రూపొందించి నవంబరు 1వ తేది నుంచి ట్రెక్కింగ్‌కు అనుమతులిచ్చారు.

40 కొండ మార్గాలు...

రాష్ట్రంలో మొత్తం 40 కొండ మార్గాల్లో ట్రెక్కింగ్‌కు అనుమతించారు. నీలగిరి జిల్లాలో 10, కోవైలో 7, తిరుప్పూర్‌లో ఒకటి ట్రెక్కింగ్ మార్గాలు ప్రకటించగా, దిండుగల్, సేలం, తేని, తిరునల్వేలి, తెన్‌కాశి, కృష్ణగిరి, తిరుపత్తూర్, కన్నియాకుమారి, విరుదునగర్, మదురై, తిరువళ్లూర్ తదితర జిల్లాల్లో కూడా ట్రెక్కింగ్ మార్గాలున్నాయి. కొండ ఎక్కేందుకు ఒకరికి రూ.599 నుంచి గరిష్ఠంగా రూ.5,099 వరకు ఛార్జీ వసూలు చేస్తున్నారు. సులభమైన విభాగంలో రూ.599 నుంచి రూ.1,449, సులభమైన విభాగంలో రూ.1,199 నుంచి రూ.3,549, కష్టమైన విభాగంలో రూ.2,799 నుంచి రూ.5,099 వరకు ఛార్జీ వసూలుచేస్తున్నారు. ఈ ఛార్జీకి 5 శాతం జీఎస్టీ అదనంగా చెల్లించాల్సి ఉంది. ట్రెక్కింగ్‌లో పాల్గొనే వారికి, మార్గదర్శకులకు బీమా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ట్రెక్కింగ్ ఛార్జీలు అధికంగా ఉన్నాయని, వాటిని తగ్గించాలని పలువర్గాల నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్లారు. ఈ నేపథ్యంలో, ట్రెక్కింగ్ ఛార్జీలు 25 శాతం తగ్గిస్తున్నట్లు అటవీ శాఖ ప్రకటించింది. ఆ ప్రకారం, సులభమైన విభాగంలో రూ.539 నుంచి రూ.1,299, మితమైన విభాగంలో రూ.1,019 నుంచి రూ.3,019, కష్టమైన విభాగంలో రూ.2,099 నుంచి రూ.3,819 ఛార్జీగా నిర్ణయించారు.

నేడు 'ఫిట్ ఇండియా' అవగాహన ర్యాలీ

ఐసిఎఫ్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన సంక్షేమం, క్రీడలు, క్రీడా అథారిటీ ఇండియా ట్రైనింగ్ సెంటర్ చెన్నై, తమిళనాడు సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం 'ఫిట్ ఇండియా' అవగాహన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ సైక్లిస్టులు కేఎస్ గోపాల్, డి.పళని ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఉదయం 6 గంటలకు అన్నానగర్ టవర్ నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ మెరీనా బీచ్‌కు చేరుకొని, మళ్లీ అక్కడి నుంచి అన్నానగర్ టవర్‌కు చేరుకుంటుందని, విజేతలకు ట్రోఫీలు, బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పుచ్చకాయపై గుకేష్ చిత్రం



పుచ్చకాయపై గుకేష్ చిత్రం రూపొందిస్తున్న ఇలంచెళియన్

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తేనిలో చెస్ ఛాంపియన్ గుకేష్ చిత్రాన్ని పుచ్చకాయపై రూపొందించిన కళాకారుడిని పలువురు ప్రశంసించారు. రాష్ట్రానికి చెందిన చెస్ క్రీడాకారుడు గుకేష్ రెండు రోజుల క్రితం ఛాంపియన్‌గా నిలిచారు. గుకేష్‌కు ముఖ్యమంత్రి సహా పలువురు అభినందలు తెలిపారు. గుకేష్‌కు అభినందనలు తెలిపేలా తేని అల్లి నగరం కాయగూరల శిల్ప కళాకారుడు ఇలంచెళియన్ పుచ్చకాయపై గుకేష్ చిత్రం రూపొందించి పలువురు ప్రశంసలు అందుకున్నాడు.

కృపా హోంలో
ప్రపంచ దివ్యాంగ మాసోత్సవం



వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగ మాసోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆకాంక్ష 2024' పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూరులోని దయానంద కృపా హోంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏఐఎం ఫర్ సేవా మేనేజింగ్ ట్రస్టీ షీలా బాలాజీ, బుద్ధి క్లినిక్ ఫౌండర్ డాక్టర్ ఈఎస్ కృష్ణమూర్తి, స్వామి దయానంద కృపా హోం సీఈవో ఆర్‌వీ గిరిధర్ పాల్గొన్నారు. 'మినీ డే ఎట్ కృపా' అనే పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో వివిధ ఈవెంట్స్ నిర్వహించారు. ఈ వేడుకలను ప్రతి యేటా డిసెంబరు నెలలో ఇక్కడ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

మైలాపూరులో మార్గళి శోభ

భజనపాటలతో అలరించిన చిన్నారులు





ఆండాళ్ వేషధారణతో పాశురాలను గానం చేస్తున్న చిన్నారులు - మైలాపూరు మాడవీధుల్లో తిరుప్పావై, తిరువెంబావై పాశురాలను పారాయణం చేస్తున్న భజనగోష్టి సభ్యులు

చెన్నై, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాసానాం మార్గశీర్షోహం... అన్నారు కృష్ణపరమాత్మ. మద్భగవద్గీత అవతరించిన మాసం కూడా ఇదే. దక్షిణాయనం చివరి భాగమైన ఈ మాసంలో దేవతలను ఆరాధించినా, కీర్తిస్తూ భజన పాటలు పాడినా ముక్తి లభిస్తుందని వేదపండితులు చెబుతుంటారు. మార్గశిర మాసారంభంలో శూడికొడుత్త నాచ్చియార్ (గోదాదేవి) కాత్యాయనీ వ్రతాన్ని ఆరంభించి ముప్పది పాశురాలను అందించి, ఆ మహావిష్ణువునే పతిగా పొంది ఆయనలోనే ఐక్యమొందింది. ఇంతటి విశిష్టతను సంతరించుకున్న తమిళ మార్గళి మాసంలో ఆధ్యాత్మికతకు తొలి చిరునామా అయిన మైలాపూరు క్షేత్రంలో ప్రతిరోజూ భక్తులు మాడవీధులలో భజనపాటలు పాడుతుంటారు. ఆ ప్రకారమే మార్గళి మొదటి రోజు మైలాపూరు కపాలీశ్వరాలయ మాడవీధుల్లో స్థానిక భక్తిమండలి సభ్యులు భజనలు నిర్వహించారు. కపాలీశ్వరాలయం ఎదుట బాలికలు గోదాదేవి వేషాలు వేసుకుని చిడతలు పట్టుకుని భజన పాటలు పాడుకుంటూ చిందులేస్తూ వెళ్ళారు. ఇదే విధంగా భజనగోష్ఠి సభ్యులైన మహిళలు కూడా ప్రాచీన సాంప్రదాయ పద్ధతిలో మాడవీధులలో తిరుప్పావై, తిరువెంబావై పారాయణం చేస్తూ వెళ్ళారు.

1971 యుద్ధ వీరులకు నివాళి



విజయ వీరులకు నివాళులు



అడయార్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో విజయం సాధించిన భారత విజయ వీరులకు భారత రక్షణ శాఖ ఉన్నతాధికారులు సోమవారం నివాళులర్పించారు. కామరాజర్ సాలైలోని విక్టరీ వార్ మెమోరియల్ స్థూపానికి ఇండియన్ ఆర్మీ దక్షిణ భారత్ ఏరియా (చెన్నై) చీఫ్ ఆఫ్ స్టాఫ్ మేజర్ జనరల్ ఆర్ఎం శ్రీనివాస్, త్రివిధ దళాలకు చెందిన సీనియర్లు పాల్గొని పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

తిరుప్పావై అలంకారంలో ఆండాల్

అడయార్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్గళి మాస ప్రారంభాన్ని పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామున శ్రీవిల్లిపుత్తూరు ఆండాల్ అమ్మవారు తిరుప్పావై ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ.5 లక్షల విలువైన తిరుప్పావై పాశురాలతో రూపొందించిన పట్టుచీర ధరించి ఆండాల్ భక్తులకు దర్శనమిచ్చారు. మార్గళి మాసం సోమవారం వేకువజామున 3.30 గంటలకు ప్రారంభమైంది. దీన్ని పురస్కరించుకుని ఆండాల్ ఆలయంలో ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆ జిల్లాకే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా పాల్గొన్నారు.

తిరుచెందూరు తీరంలో స్నానాలకు అనుమతి



సముద్రతీరంలో స్నానాలు చేస్తున్న భక్తులు

టి.నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం వద్ద భక్తులు సముద్రతీరంలో స్నానమాచరించేందుకు అధికారులు అనుమతించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, పెనుగాలుల కారణంగా అక్కడి సముద్రతీరం వెనక్కి మళ్ళింది. ఆ తర్వాత అలల ఉధృతికూడా అధికమైంది. దీంతో శని, ఆదివారాల్లో సముద్రంలో స్నానాలకు అధికారులు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుండి భక్తులను సముద్రతీరంలో స్నానం చేయడానికి అధికారులు అనుమతించారు.



ఏటీసీ దాకా క్యూలైన్

సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు


ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,160

తలనీలాలు సమర్పించినవారు : 22,724

చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే..!

● 'పడమటి గాలి' నాటకంలో ఆకట్టుకున్న రాంకోటి ప్రతిన

● మాయోడి పాత్రలో ఆకట్టుకున్న రిటైర్డు ఐఏఎస్ బలరామయ్య





తన చాయైనా.. బతుకైనా.. మట్టిలోనే అని పిడికిట మట్టి సాక్షిగా రైతు రాంకోటు చేసిన శపథం.. 'పడమటి గాలి' నాటకంలో ఉద్వేగపూరితంగా కనిపించింది. తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో పాటిబండ్ల ఆనందరావు రచించిన ఈ నాటకాన్ని సోమవారం సా యంత్రం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించారు. మాయోడి పాత్ర ద్వారా రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య అందరినీ ఆకట్టుకున్నారు. ధ్వంసమైపోతున్న గ్రామీణ జీవనాన్ని దృశ్యమానం చేసిందీ నాటకం. ఈ నాటకంలో దళారీ పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ పాత్రను పోషించారు. మల్టీనేషనల్ కంపెనీ ఏర్పాటు కోసం అవసరమైన భూ సేకరణలో జరిగిన సంఘర్షణ ఈ నాటకానికి ఇతివృత్తం. 50 ఎకరాల భూమి అవసరమవుతుంది. ఓ రైతుకున్న 4 ఎకరాల భూమిని ఎలాగైనా దక్కించుకోవాలని గ్రామంలోని దళారీ ద్వారా ఎత్తుగడ వేస్తారు. కొడుకు ద్వారానూ పన్నాగం పన్నుతారు. కడకు రైతును తన కొడుకు చేతులారా కడతేర్చడానికి కుట్ర చేస్తారు. ఎన్ని కుయుక్తులు పన్నినా నమ్ముకున్న భూమిని అమ్ముకోని రైతు రాంకోటు ఆత్మస్థైర్యం ఈ నాటకానికి పరాకాష్టగా నిలుస్తుంది. ఈ సందర్భంగా రచయిత పాటిబండ్ల ఆనందరావు మాట్లాడుతూ.. 25 ఏళ్లకుపైగా 150 ప్రదర్శనలు నిర్వహించినట్టు తెలిపారు. వేగవంతమైన జీవన శైలిని దృష్టిలో ఉంచుకొని రెండు గంటల నిడివితో ఈ నాటకాన్ని ప్రదర్శించినట్టు తెలిపారు. తిరుపతిలో ఇప్పటికీ ఈ నాటకానికి ఇంత ఆదరణ ఉండటం తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. నాటక ప్రదర్శనకు ముందు తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు సాకం నాగరాజ, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ తదితరులు మాట్లాడారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించండి

● కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 150 వినతులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అందజేసే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 150 అర్జీలు అందగా, అందులో భూ సమస్యలపైనే 94 ఉన్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మౌలిక వసతులు కల్పించండి



కల్యాణ వెంకటేశ్వరపురం గ్రామస్తులు

'పుత్తూరు మండలం నేసనూరు గ్రామ పంచాయతీ కల్యాణ వెంకటేశ్వరపురంలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి.. పంట నష్టపరిహారం కూడా ఇప్పించండి. రైతులకు డీకేటీ పాసుపుస్తకాలు, నివాస భూముల కోసం పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు చేయండి' అంటూ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు.

పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయండి



పారా మెడికల్ రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్న విద్యార్థులు

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో బీఎస్సీ, ఎంఎల్‌టీ కోర్సులు పూర్తి చేశామని, కళాశాల అధికారుల తప్పిదం వల్ల పారా మెడికల్ రిజిస్ట్రేషన్ కల్పించలేదని విద్యార్థులు దీప్తి, భూలక్ష్మి, చందు, పల్లవి, రమ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పారా మెడికల్ రిజిస్ట్రేషన్, ఉపాధి కల్పించాలని అభ్యర్థించారు.

ప్రత్యామ్నాయ స్థలం చూపండి

తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాస కల్యాణ మండపాల సమీపంలో హథీరాంజీ మఠం స్థలంలో చేపలు విక్రయించి జీవనం సాగిస్తున్నామని, మున్సిపల్ అధికారులు అక్కడ వ్యాపారం చేయరాదని బెదిరిస్తున్నారని, ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు కోరారు. ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఏఐటీయూసీ నేతలు శ్రీనివాసులు, శివకుమార్, బాలాజీ, విజయ్, గురవయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చేపల వ్యాపారులు

రెండు బార్లకు ఈ టెండర్ల ఆహ్వానం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో రెండుబార్లకు ఈ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది ఆగస్టు 31 వరకు తొమ్మిది నెలల కాలానికి సంబంధించి బార్లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 23న పరిశీలించి లాటరీ ద్వారా 24న అర్హులను ఎంపిక చేసి, దుకాణాలు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం గూడూరు ఏఈఎస్ హరాహశ్రీని 9440902265, నాయుడుపేట ఎక్సైజ్ సీఐ 9440902516, సూళ్లూరుపేట ఎక్సైజ్ సీఐ 9440902515, తిరుపతి కంట్రోలు రూము ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9603274401ను సంప్రదించాలని కోరారు.

అసైన్‌మెంట్ భూముల విషయమై వివాదం

స్వాధీనానికి అధికారుల చర్యలు ● కుమ్మరిపాళెంలో ఇరువర్గాల ఘర్షణ

చిట్టమూరు, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిన భూముల విషయమై నెలకొన్న వివాదం ఇరు వర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. చిట్టమూరు మండలం బురదగాలి పంచాయతీ పరిధిలోని కుమ్మరిపాళెం గ్రామంలో సర్వే నెంబర్ 16లో 9ఎకరాల భూమిని గిరిజనులకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చారు. అయితే గిరిజనులు చాలా ఏళ్లుగా స్థానికంగా నివాసం లేకపోవడంతో కోట మండలానికి చెందిన వైసీపీ నేత దగ్గర పనిచేసే హరికృష్ణ అనే వ్యక్తి సదరు భూములను స్వాధీనం చేసుకున్నాడు. దీనిపై కుమ్మరిపాళెం గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ చెప్పగా, ఇందుకు గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. దీంతో సదరు భూముల్లోకి ఎవరూ ప్రవేశించవద్దంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంగా హరికృష్ణ వివాదాస్పద భూముల్లో వరి పంట సాగు చేశారు. దీంతో ఆ భూములను స్వాధీనం చేసుకొనేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు సోమవారం కుమ్మరిపాళెం గ్రామానికి చేరుకున్నారు. తాను గిరిజనుల వద్ద భూములను కొనుగోలు చేశానని హరికృష్ణ అధికారులకు వివరించారు. అయితే అసైన్‌మెంట్ పట్టా పొందిన వారే భూములను సాగు చేసుకోవాలని, లేదంటే స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఇంతలో గ్రామస్తులు జోక్యం చేసుకుని గిరిజనులు భూములను అమ్మలేదని, ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని చెప్పారు. దీంతో గ్రామస్తులకు హరికృష్ణ, అతని సోదరుడు రామ్ కుమార్ మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో ఇరువర్గాలకు స్వల్ప గాయాలయ్యాయి. కాగా, వివాదాస్పద భూములపై సర్వే చేయించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.



ఆక్రమణదారులతో ఘర్షణ పడుతున్న గ్రామస్తులు

పోలీసు పీజీఆర్ఎస్‌కు 90 వినతులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 90 వినతులు వచ్చాయి. అదనపు ఎస్పీలు నాగభూషణం, రవిమనోహరాచారి, ఎస్పీ సీఐ శ్రీనివాసులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన వాటిని ఆయా పోలీసు స్టేషన్లకు పంపి, పరిష్కరించాలని ఆదేశించారు.



ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న ఎస్పీ సుబ్బరాయుడు

ఎయిర్‌పోర్టులో శ్రీవాణి కౌంటర్ల పరిశీలన



రేణిగుంట/ తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఎయిర్‌పోర్టులోని శ్రీవాణి టికెట్ల కౌంటర్లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం పరిశీలించారు. భక్తుల నగదు చెల్లింపులు, టికెట్లు, రసీదు జారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ వివరాలపై కౌంటర్ సిబ్బందిని విచారించారు. టికెట్లపై పలువురు భక్తుల అభిప్రాయాలు స్వీకరించారు.

ఆటో దొంగలు

జల్సాల కోసం చోరీలు.. ఇద్దరి అరెస్టు



ఆటోలతో పాటు నిందితులను చూపుతున్న క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ మంచి మిత్రులు. పదో తరగతి వరకు చదువుకున్నారు. జల్సాలు, వ్యసనాలకోసం దొంగతనాల వైపు అడుగులు వేశారు. కడప, తిరుపతి జిల్లాల్లో ఆటోలను దొంగలించి అమ్మే.. ఈ ఇద్దరిని తిరుపతి క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. క్రైం డీఎస్పీ రమణకుమార్ తెలిపిన ప్రకారం.. స్నేహితులైన రేణిగుంట మండలం వేణుగోపాలపురానికి చెందిన దొడ్డి కార్తీక్, తిరుపతి సింగాలగుంటకు చెందిన కె.లలితకుమార్ చెడు అలవాట్లకు బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో తొలుత మేకలను దొంగతనం చేసి సంతల్లో విక్రయించి ఆ డబ్బును పంచుకుని విలాసాలకు ఖర్చు పెట్టేవారు. కొంత కాలంగా కడప జిల్లా ఓబులవారిపల్లి, తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆటోలను దొంగలించి విక్రయించే వారు. ఆ డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇటీవల కొందరు బాధితుల ఫిర్యాదు మేరకు క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ పెద్దరత్తయ్య, ప్రకాష్‌కుమార్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బసవరాజు, కానిస్టేబుళ్ళు నాగరాజు, ప్రసాద్, మోహన్‌తో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆటో దొంగలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పద రీతిలో తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు ఆటోలు దొంగిలించినట్లు చెప్పడంతో వారి నుంచి రూ.6 లక్షల విలువైన నాలుగు ఆటోలను సీజ్ చేశారు.

అమ్మో.. పులి!

● వేద వర్సిటీలో భయాందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని వేద విశ్వవిద్యాలయంలో పులి సంచారం ఆందోళన కలిగిస్తోంది. రెండు వారాల క్రితం పద్మావతి హాస్పిటల్ - వేద వర్సిటీ లైబ్రరీ మధ్య రాత్రి 9 గంటల సమయంలో పులి కనిపించింది. పులిని చూసిన విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. మూడు రోజుల ముందు మరోసారి వేద వర్సిటీకి అలిపిరి రోడ్డు వైపు ఉన్న ఆర్చి వైపు నుంచీ ప్రవేశించిన పులి ఏడీ బిల్డింగ్ సమీపానికి వచ్చినట్టు తెలుస్తోంది. అక్కడ్నుంచి జింకను తరుముకుంటూ అకడమిక్ బిల్డింగ్ వైపు పులి వెళ్ళినట్టు విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది గమనించినట్టు సమాచారం. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు యూనివర్సిటీ నుంచీ సమాచారం అందించారు. దీంతో ఫారెస్టు అధికారులు సోమవారం యూనివర్సిటీకి వచ్చి పరిస్థితిపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. పులి సంచారం నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని ఫారెస్టు అధికారులు సూచించారు. రాత్రి వేళల్లో అత్యవసరమైతే తప్ప వెలుపలకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. సెక్యూరిటీ సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





జస్టిస్ భవాని ప్రసాద్ - జస్టిస్ వేలుమణి

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఉడిపిలోని చిత్రాపూర్ మఠాధిపతి విద్యేంద్ర తీర్థ స్వామిజీ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి భవానిప్రసాద్, కలకత్తా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి, తమిళనాడు మాజీ సీఎం పళనిస్వామి సతీమణి రాధ ఉన్నారు.





విద్యేంద్రతీర్థ స్వామిజీ - రాధ

భారత్ - రష్యా మధ్య పెరుగుతున్న దౌత్య సంబంధాలు

● దక్షిణ భారత రష్యా కాన్సిల్ జనరల్ వాలెర్రి కోర్చేవ్

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): రష్యా - భారత్ మధ్య దౌత్య సంబంధాలు పెరుగుతున్నాయని దక్షిణభారత రష్యా కాన్సిల్ జనరల్ వాలెర్రి కోర్చేవ్ పేర్కొన్నారు. ఆళ్వార్‌పేటలోని రష్యన్ సైన్స్ అండ్ కల్చర్ సెంటర్ (ఆర్‌సీఎస్‌సీ)లో సోమవారం భారత్-రష్యా దేశాల మధ్య మెరుగైన ద్వైపాక్షిక సంబంధాలేర్పడి 77 ఏళ్లు పూరైన నేపథ్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇరు దేశాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను దక్షిణభారత రష్యా కాన్సిల్ జనరల్ వాలెర్రి ప్రారంభించి ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 8,9 తేదీలలో మాస్కోలో జరిగిన ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం అనంతరం భారత రష్యా దేశాల మధ్య గల సంబంధాలు మరింత మెరుగైయ్యాయన్నారు. అలాగే అక్టోబర్ 22-24 తేదీల్లో రష్యాలోని కజాన్‌లో జరిగిన 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం ఉమ్మడి ఆర్థిక ఎజెండాలోని సమస్యల్లో ఒకటైన కమ్యూనిటీ మెంబర్ షిప్ విస్తరణకు మార్గం చూపినట్లైందన్నారు. అనంతరం ఆర్‌సీఎస్‌సీ డైరెక్టర్ అలెగ్జాండర్ డోడానోవ్ మాట్లాడుతూ.. ఈ నెల 22న తొలిసారిగా రాష్ట్రస్థాయి చెస్ పిల్లల టోర్నమెంట్‌ను తమ కేంద్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రష్యన్ దౌత్య కార్యాలయ చెన్నై అధికారి ఆండ్రి ఎరోకిన్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వెటరెన్ చైర్మెన్ మార్షల్ ఎం.మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ప్రదర్శన తిలకిస్తున్న వాలెర్రి కోర్చేవ్, అలెగ్జాండర్ డోడానోవ్ తదితరులు

వైభవంగా ఉమామహేశ్వరుల తిరు కల్యాణం

● 281 రకాల సారె సమర్పించిన ముస్లింలు

● ధర్మపురిలో వెల్లివిరిసిన 'మతసామరస్యం'

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో మతసామరస్యాన్ని చాటేలా ఉమామహేశ్వరుల తిరు కల్యాణంలో ఇస్లామీయులు పాల్గొని హిందూ సంప్రదాయం ప్రకారం 281 రకాల సారె వస్తువులు సమర్పించారు. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని బొమ్మిడి ప్రాంతంలో ఉన్న ప్రాచీన అరుణాచలేశ్వరాలయంలో కార్తీక పౌర్ణమి రోజైన ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కల్యాణార్థం ఉమామహేశ్వరీ సమేత అరుణాచలేశ్వర కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా నివసిస్తున్న ముస్లింలు దైవ దంపతులకు పట్టు వస్త్రాలు సహా 281 రకాల సారె వస్తువులతో బాజాభజంత్రీలు, కళాకారుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. వారికి ఆలయ నిర్వాహకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతించారు. పెళ్లితంతు, చదివింపులు, విందు అనంతరం ప్రత్యేక వాహనంలో దైవదంపతులను ముస్లింలు నివసిస్తున్న ప్రాంతాల్లో ఊరేగించారు. ఎలాంటి పోలీసు భద్రత, మత విద్వేషాలకు తావు లేకేండా హిందూ, ముస్లింలు ఐక్యతతో జీవిస్తున్న బొమ్మిడి గ్రామం ఆదర్శవంతంగా నిలిచిందని పలువురు ప్రశంసించారు.

వైషమ్యాలు మరచి కలిసిన రెండు పంచాయతీలు

తిరుత్తణి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలకు ప్రజలు చరమగీతం పాడారు. కార్తీక దీపోత్సవం రెండో రోజున రెండు పంచాయతీల పెద్దలు తాంబూలాలు మార్చుకొని, ఇకపై గొడవలు లేకుండా కలసి మెలసి జీవిద్దామని నిర్ణయించారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి తాలూకా తిరువలంగాడు యూనియన్ పరిధిలోని తోసుడవూర్ పంచాయతీలో 2,000 మంది జీవిస్తున్నారు. అలాగే, చిన్నమ్మపెట్ట పంచాయతీలో 2,500 మంది ఉన్నారు. ఈ రెండు పంచాయతీల మధ్య 50 ఏళ్లుగా వివాదాలు, తగాదాలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో, వైషమ్యాలు పక్కనబెట్టి రెండు పంచాయతీల ప్రజలు స్నేహపూరిత వాతావరణంలో జీవించాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆ ప్రకారం, కార్తీక దీపోత్సవం రెండో రోజు తోసుడవూర్ పంచాయతి ప్రధానాధికారి అరుళ్ మురుగన్, చిన్నమ్మపెట్టి పంచాయతి అధ్యక్షులు శరణ్య నాగరాజ్ ఇరు గ్రామాల ప్రజల సమక్షంలో, రెండు గ్రామాల సరిహద్దు ప్రాంతంలో తాంబూలాలు మార్చుకున్నారు. అర్ధరాత్రి వేళ అన్నీ మరచి ఇరుగ్రామాల పెద్దలు తాంబూలాలు మార్చుకోవడంపై ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తాంబూలాలు మార్చుకుంటున్న ఇరుగ్రామాల పెద్దలు

ఫిబ్రవరి 15నుంచి టైప్ రైటింగ్ పరీక్షలు

పెరంబూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌హ్యాండ్, టైపింగ్, కామర్స్ పరీక్షలు ఫిబ్రవరి 15వ తేది నుంచి ప్రారంభమవుతాయని ప్రభుత్వ సాంకేతిక విద్యా డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఫిబ్రవరి, ఆగస్టులో తమిళం, ఇంగ్లీషు టైపింగ్, షార్ట్‌హ్యాండ్, కామర్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో, వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించనున్న పరీక్షలకు హాజరు కావాలనుకొనే విద్యార్థులు సోమవారం నుంచి 2025 జనవరి 17వ తేది వరకు టీటీడీఎచ్‌టీఎచ్‌ఇ.జీ‌ఓవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. షార్ట్‌హ్యాండ్ హై స్పీడ్ టెస్ట్ ఫిబ్రవరి 15,16, జూనియర్, మాస్టర్ పరీక్షలు 22,23, బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ మాస్టర్స్ ఎగ్జామినేషన్ 24, టైపింగ్ జూనియర్ మాస్టర్, మాస్టర్ హై స్పీడ్ మార్చి 1,2 తేదీల్లో జరుగునున్నాయని అధికారులు తెలిపారు.

హోటళ్లకు బాంబు బెదిరింపులు

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీలోని ప్రముఖ హోటళ్లకు ఆదివారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో హోటళ్ల యాజమానులు పోలీసులకు సమాచారమివ్వగా, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలను నిర్వహించి బాంబు లేదని నిర్ధారించారు. బాంబు బెదిరింపుపై ఏడీఎస్పీ సౌందర్యరాజన్ మాట్లాడుతూ.. నిత్యం ఈ-మెయిల్స్ పంపితే ఆ మెయిల్ అడ్రస్ ఎవరిదో సులభంగా కనుగొనచ్చు. దీనిపై సమగ్ర విచారణ జరిపి త్వరలోనే ఈ ఆకతాయిలను పట్టుకుంటామని ఏడీఎస్పీ పేర్కొన్నారు.

తిరుమలలోనూ ఇకపై హెల్మెట్ తప్పనిసరి

అమలుపై అధికారుల కసరత్తు

తిరుమల, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలోనూ ఇకపై ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ అధికారులు నిర్ణయించారు. ప్రమాదాల నివారణ కోసం ఇప్పటికే కొన్నేళ్లుగా తిరుమల మొదటి, రెండో ఘాట్‌లో హెల్మెట్ తప్పనిసరి నిబంధన కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా, తిరుమలలో తిరిగే ద్విచక్రవాహనదారులకు కూడా హెల్మెట్ తప్పనిసరి చేయాలని పోలీసు అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం కొన్ని ప్రాంతాల్లో భక్తులు, స్థానికులు, వ్యాపారులు, ఉద్యోగులకు హెల్మెట్ పెట్టుకుని డ్రైవ్ చేయాలని సూచించారు. ఇక, అతి తక్కువ పరిధిలో ఉండే తిరుమలలో ద్విచక్రవాహనాలపై వేగంగా వెళ్లే అవకాశం ఉండదు. అలాంటప్పుడు తిరుమలలో హెల్మెట్ నిబంధన అవసరమా అనే చర్చ మొదలైంది. అయితే ద్విచక్రవాహనదారుల భద్రత కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సూచనల మేరకు ఈ నూతన నిర్ణయాన్ని అమలుచేయాలనే ఆలోచన చేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.



చెన్నై రిప్పన్‌భవనంలో సోమవారం ఉదయం ప్రత్యేక శిక్షణకు ఎంపికైన ఆరోగ్య సిబ్బందికి లాప్‌టాప్‌లు ఎల్‌సీడీ ప్రొజెక్టర్లను పంపిణీ చేస్తున్న మేయర్ ఆర్ ప్రియా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

దేశంలోనే తమిళనాట తక్కువ విద్యుత్ ఛార్జీలు

● రాష్ట్ర ప్రభుత్వం

ప్యారీస్, డిసెంబర్ 16 (ఆంధ్రజ్యోతి): దేశంమొత్తమ్మీద తమిళనాడులో మాత్రమే తక్కువ విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ప్రకటన విడుదల చేసింది. గృహవినియోగ విద్యుత్‌కు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో తక్కువ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అంతే కాకుండా దేశంలోనే తొలిసారిగా రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా జరిగింది కూడా రాష్ట్రంలో మాత్రమేనని, ప్రస్తుతం సుమారు 2 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతున్నట్లు పేర్కొంది. అలాగే మరమగ్గాల కార్మికులకు రెండు నెలలకు ఒకసారి 1000 యూనిట్లు, చేనేత కార్మికులకు రెండు నెలలకు ఒకసారి 300 యూనిట్ల, వరకు ఉచిత విద్యుత్ సరఫరా అవుతుందని, అయినప్పటికీ విద్యుత్ ఛార్జీల్లో ఎలాంటి మార్పులు చేయలేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.